ప్రజాశక్తి

గురువారం 22 డిసెంబర్ 2022

8 పేజీలు





విశాఖపట్నం

అనకాపల్లి

సమరశీలతే కార్మికవర్గ ఆయుధం

- కార్మికా... కదలిరా విశాఖ...
- నేటి నుంచే సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభలు
- సిద్ధమైన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం



విశాఖ నగరంలో ఏర్పాటైన సిఐటియు జెండాలు



మహాసభల వేదిక ఏర్పాట్లు....

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) విశాఖ జిల్లా 12వ మహాసభలకు కార్మికోద్యమవాడ విశాఖ సిద్ధమైంది. లలితానగర్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె) ఇందుకు వేదికైంది. ఈ నెల 21, 22 తేదీల్లో సిఐటియు మహాసభలు ఇక్కడే జరుగనున్నాయి. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణోద్యమం 678 రోజులుగా సాగుతున్న పోరాటాల పురిటిగెడ్డ, కార్మిక విశాఖ కేంద్రంలో ఈ మహాసభలు నిర్వహించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. అంతేగాక ప్రపంచ వ్యాప్తంగా నయా ఉదారవాద విధానాలు కార్మికోద్యమ సంఘటిత శక్తిని ఒకవైపు దెబ్బ తీస్తున్నా కార్మికుల ప్రతిఘటనా సామర్థ్యం పెరుగుతోంది... అని చెప్పడానికి సరైన ఉదాహరణగా స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని సిఐటియు ముందుండి నడిపించడం ఒక ప్రత్యేకత. స్టీల్‌ప్లాంట్ ఉద్యమమే కాకుండా అనేక రంగాల్లో కార్మికుల స్థితిగతులను మార్చేందుకు గడిచిన మూడేళ్లలో అనేక పోరాటాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రమంలో 12వ మహాసభలు కార్మికోద్యమాల పురోగతికి మరింత స్ఫూర్తినివ్వనున్నాయి. గడిచిన మూడేళ్ల కాలంలో సిఐటియు చేసిన పోరాటాలు, సాధించిన విజయాల అనుభవాలతో ఈ రెండు రోజుల సభల్లో భవిష్యత్తు పోరాట కార్యాచరణను కార్మికులు రూపొందించుకోనున్నారు. ఈ మహాసభలు

మిగతా 2లో..



కనీస వేతనాల సాధనకు బలమైన పోరాటాలు : ఆర్‌కెఎస్‌వి కుమార్

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కనీసవేతనం రూ.26 వేలు చేయాలన్న డిమాండ్‌తో నగరంలోని 79 షెడ్యూల్డ్ పరిశ్రమలలో పనిచేస్తున్న 2 లక్షల మంది కార్మికులకు వర్తింపజేయాలన్న పోరాటాలు ఈ రంగంలోని కార్మికులను ఐక్యపరిచాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. మహాసభల సందర్భంగా ప్రజాశక్తితో పంచుకున్న వివరాలు ఆయన మాటల్లోనే.... గత 12 సంవత్సరాలుగా జీవోలను ప్రభుత్వాలు సవరించలేదు. గతంలో కనీస వేతనాల సవరణ రెండేళ్లకే ఉండేది. పాలనలోకి చంద్రబాబు వచ్చాక 5ఏళ్లకు మార్చారు. కానీ బాబు అమలు చేయలేదు. ఆ తర్వాత జగన్ వచ్చినా అమలు

మిగతా 2లో..



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు

విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని విశాఖ జిల్లా స్థాయిలో ఆనందపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. చెప్పారు. నాడు నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్కూల్స్‌కు దీటుగా సుందరీకరణ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా, అభ్యాస అంతరాన్ని తగ్గించడం కోసం, అభ్యసన ఫలితాలను డిజిటల్ పరికరాల కంటెంట్‌ను ఉపయోగించి విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ యొక్క ప్రీమియం కంటెంటును లోడ్ చేసిన ట్యాబ్ లను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. విశాఖ జిల్లాలో 11,223 విద్యార్థులకు, 1,116 మంది ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 12,339 ట్యాబ్ లను పంపిణీ చేస్తున్నామన్నారు.

భీమిలి ఎమ్మెల్యే

మిగతా 2లో..

కుప్పకూలిన పురాతన భవనం : ఇద్దరికి గాయాలు

▶ వార్త 2లో..

మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర కార్యవర్గంలో జివిఎంసి నాయకులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 20, 21 తేదీలల్లో అనంతపురంలో జరిగాయి. ఈ సమావేశాలకు విశాఖపట్నం నుంచి 32 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశాల్లో ఏర్పడిన నూతన కార్యవర్గంలో జివిఎంసికి చెందిన నాయకులు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టి.నూకరాజు, ఎస్.ఇందీవర, ఎంవి.ప్రసాద్ రావు, కార్యదర్శిగా ఉరకూటి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా వి.కృష్ణారావు, గొలగాని అప్పారావు, మహేశ్వరి, ఆదినారాయణ, వెంకటరావు, రత్నం ఎన్నికయ్యారు. ఈ మహాసభల్లో జివిఎంసిలో ఖాళీగా ఉన్న 482 డెత్, సిక్కు పోస్టులు కార్మికుల వారసులకు ఇవ్వాలని తీర్మానం చేశారు.



ఎంవి.ప్రసాదరావు



టి.నూకరాజు



ఎస్.ఇందీవర



రాజు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్మించలేదని, అలాంటప్పుడు దానిని అమ్మే హక్కు ఎక్కడిదని సిఎఫ్‌టియుఐ సంప్రదాయ మత్స్యకారుల యూనియన్ నేత ఎం.లక్ష్మి ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 629వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ కోసం భూములను సేకరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన భూమిక పోషించిందని చెప్పారు. అటువంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా స్టీల్‌ప్లాంట్‌ను ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షల్లో కె.లక్ష్మి, మైలపల్లి ఎర్రమ్మ, కె.జగది, పి.దుర్గ, బి.లక్ష్మి, మైలపల్లి అప్పయ్యమ్మ, జి.లక్ష్మి, ఎస్. రమ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఎంవిపి కాలనీ బీచ్ రోడ్ గాదిరాజు ప్యాలస్‌లో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు క్రెడాయ్ 8వ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు క్రెడాయ్ చైర్మన్ బాయన శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు ఇటువంటి ప్రాపర్టీ ఎక్స్‌పోలు ఏడు నిర్వహించామని, వాటికి మంచి స్పందన రావడంతో, అదే స్ఫూర్తితో 8వ ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహిస్తామన్నారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో క్రెడాయ్‌లో సభ్యత్వమున్న సుమారు 400 సంస్థలు పాలు పంచుకుంటా యని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో ప్లాంట్‌లు, విల్లాలు, ప్లాట్లు, బిల్డింగ్ మెటీరియల్స్, నిర్మాణ సామాగ్రి, ఆర్కిటెక్చర్ ఇంటీరియల్స్ డెకరేషన్స్, బ్యాంకులకు చెందిన అన్ని రకాలకు చెందిన 100కు పైగా స్టాళ్లు ఉంటాయని చెప్పారు. మూడు రోజులపాటు ప్రతి గంటకు బంగారు నాణెం, మూడు రోజులకు కలిపి బంపర్ డ్రా విజేతకు ఎలక్ట్రిక్ స్కూటర్ బహుమతి ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు వి.ధర్మేందర్, ఎక్స్‌పో 22 కన్వీనర్ వి.శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రతినిధులు

మొదటి పేజీ తరువాయి..

సమరశీలతే కార్మికవర్గ ఆయుధం

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కార్మిక నాయకులు ఆర్‌పిరాజు నగర్ పేరుతో జరుగనున్నాయి. మహాసభల ప్రాంగణానికి ఎన్.రమణాచలం ప్రాంగణంగానూ, సభా వేదికకు కె.సూర్యనారాయణ వేదికగా నామకరణం చేశారు. గురువారం ఉదయం 10.30 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యే ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర సిహెచ్.నర్సింగరావు హాజరు కానున్నారు.

ఎన్నో పోరాటాలు... ఎన్నెన్నో విజయాలు

ఈ కాలంలో చెప్పుకోదగ్గ కార్మికోద్యమం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుంటూ ముందుకు సాగడం. 678 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, విశాఖ నగరంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు బహుముఖ పోరాటాలను కొనసాగిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 2021 జనవరి 27న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను 100శాతం ప్రయివేటీకరణకు పెట్టిన ఆ క్షణాలు విశాఖ జిల్లా కార్మికవర్గాన్ని తీవ్ర కలవర పరిచాయి. ఫిబ్రవరి 11 నుంచి కూర్మన్నపాలెం వద్ద దీక్షాశిబిరం ప్రారంభించబడి కొనసాగుతోంది. ఏప్రిల్ 2 నుంచి జివిఎంసి గాంధీ బొమ్మ వద్ద విశాఖ కేంద్రంగా సిఐటియు సారథ్యంలో అఖిల పక్ష కార్మిక సంఘాలను ఏకం చేసి నేటివరకూ నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది. ఈ మొత్తం పోరాటాల కాలంలో కేంద్రంలోని బిజెపి దూకుడుకు కళ్లెం వేయగలగడం గొప్ప పరిణామం. దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే కుట్రలను కార్మికవర్గం రాత్రీపగలూ కళ్లార్పకుండా చూస్తూ తిప్పికొట్టడంలో సిఐటియు ఘనమైన పాత్ర పోషిస్తూ వస్తోంది. 2021 మార్చి 21న కూర్మన్నపాలెం రోడ్డు వద్ద అఖిల పక్ష రాజకీయ పార్టీలతో భారీ బహిరంగ సభ నిర్వహించగా వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలు హాజరయ్యాయి. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ సహా పలువురు ప్రతిపక్షాలకు చెందిన నేతలూ హాజరై ప్రసంగించారు. కేంద్ర కార్మిక సంఘాలతో స్టీల్‌ప్లాంట్ తృష్ణా గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ జరగ్గా సిఐటియు ఆలిండియా నేత తపన్‌సేన్, అమర్‌జిత్ కౌర్, సంజీవరెడ్డి వంటి ఇతర సంఘాల నేతలూ హాజరయ్యారు. 200 రోజులు దీక్షలు పూర్తయిన సందర్భంగా 10వేల మందితో అగనంపూడి నుంచి భెల్ వరకూ 10వేల మందితో 10 కి.మీ మానవహారం కార్మికులు నిర్వహించారు. నగరంలోని ఆర్‌కెబీచ్‌లో కార్మికశంఖారావం పేరుతో భారీ బహిరంగ సభ జరిగింది. ఢిల్లీలో రైతు పోరాటానికి నాయకత్వం వహిస్తున్న టికాయత్, ఆలిండియా కిసాన్ సభకు సారథ్యం వహించిన అశోక్‌ధావలే విశాఖకు వచ్చి స్టీల్ కార్మికోద్యమం బాగా నిర్వహిస్తున్నారని, రైతు ఉద్యమంలాగ విజయం సాధిస్తుందని స్ఫూర్తినిచ్చి వెళ్లారు.

కనీస వేతనాల సాధనకు బలమైన పోరాటాలు

కాలేదు. వీరి అండ చూసుకుని 3 టర్మ్‌లుగా ఈ అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనాలను యాజమాన్యాలు పెంచడం లేదు. షాపులు, పెట్రోల్ బంక్‌లు, లేబరేటరీలు, సినిమా హాల్స్ కార్మికులను యాజమాన్యాలు తీవ్ర అవస్థలు పెడుతూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. నెల రోజుల పాటు దీనిపై ప్రచారం చేసి సెప్టెంబర్ 20న జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపట్టాం. లేబర్ కోడ్స్ వల్ల కార్మిక ప్రాథమిక హక్కులకు జరుగుతున్న ప్రమాదంపై నిరంతర పోరాటాలు చేపడుతున్నాం.

పారిశుధ్య కార్మికుల పోరాట విజయం...

మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్ రూ.6వేల కోసం పోరాడి సిఐటియు విజయం సాధించింది. 5 రోజుల పాటు సమ్మె కూడా చేసి ఈ హక్కును పునరుద్ధరించుకోవడం గొప్ప విజయం. కరోనా కాలంలో మున్సిపల్ కార్మికుల ఆసుపత్రిగా సిఐటియు విశాఖ జిల్లా జగదాంబ కార్యాలయాన్ని వినియోగించి ఐసొలేషన్ సెంటర్ నిర్వహించి కార్మికులకు వైద్యం, వారి బాగోగులను చూశాం. హెచ్‌పిసిఎల్‌లో ఇతర రాష్ట్రాల నుంచి పనిచేసే వారికోసం కోవిడ్ తీవ్రరూపం దాల్చే సమయంలోనూ రైల్వే అధికారులు, జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపి వారి ప్రదేశాలకు వెళ్లేలా రైళ్లు ఏర్పాటు సిఐటియు చేసింది.

పెన్షన్ కోసం పోరాటాలు

రిటైర్‌మెంట్ అయి ఇపిఎఫ్ గల వారికి రూ.9వేలు పెన్షన్ కోసం పోరాడుతున్నాం. ఎల్‌జిపాలిమర్స్ బాధితుల ఆరోగ్యాన్ని ప్రభుత్వం వదిలేయగా సిఐటియు మెడికల్ క్యాంపులు నిర్వహించింది. ప్రపంచ దేశాల ప్రతినిధులతో వెబ్‌నార్‌లు నిర్వహించి వారి డిమాండ్ల పరిష్కార కృషికి అంతర్జాతీయ మద్దతు కూడగట్టగలిగింది. ఓలా, ఊబర్ డ్రైవర్ల కమీషన్‌ని యాజమాన్యాలు తినేస్తున్న వైనంపై సిఐటియు అనేక ఆందోళనలు చేపట్టింది. చిట్టివలస జ్యూట్ మిల్లు తెరిపించాలని తగరపువలస నుంచి విశాఖ జివిఎంసి వరకూ పాదయాత్ర నిర్వహించాం. విశాఖ నగరంలో ఆటో, ముఠా, తోపుడు బళ్లు, బిల్డింగ్ వర్కర్లకు సమగ్రచట్టం, వారి ఉపాధికి రక్షణ కల్పించాలన్న పోరాటాలను భవిష్యత్తులో మరిన్ని చేపట్టనున్నాం.

నెల రోజుల్లో 104 మొబైల్ ఫోన్ల గుర్తింపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : దొంగలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గుర్తింపుకు విశాఖ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యాన సిసిఎస్ పోలీసులు ప్రవేశపెట్టిన నూతన చాట్ బాట్ వెబ్ పోర్టల్ ద్వారా మంచి ఫలితం వస్తోందని క్రైమ్ డిసిపి ఎ. నాగన్న బుధవారం తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన మొబైల్ ఫోన్లను కనుగొనేందుకు 9490617916 వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపిస్తే ఆటో రిప్లై గా లింకు వస్తుందని, ఆ లింకు ఓపెన్ చేసి పోగొట్టుకున్న ఫోన్‌కు సంబంధించిన వివరాలను పంపిస్తే సిసిఎస్ టీం సాంకేతిక నైపుణ్యంతో పరిశీలించి ఆ ఫోను ఎక్కడ ఉన్నది, ఎవరు వాడుతున్నది కనిపెడుతున్నట్లు తెలిపారు. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానం ఇప్పటికే సత్ఫలితాలు ఇస్తుందని చెప్పారు. ఈ సాంకేతిక విధానం ప్రారంభించిన 35 రోజుల్లో 20 లక్షల విలువైన 104 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగలిగామని తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లో 8 యజమానులకు మీడియా సమక్షంలోనే అందజేశారు. ఈ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిఎస్ సిఐ ఆర్.సత్యనారాయణ, ఎఎస్ఐ జి.త్రినాధరావు, పోలీస్ కానిస్టేబుల్ జి.అర్జునరావు, ఎం.శ్రీను, డి.నాయుడు, పి.వాసుదేవరావు, వి.సీతారామయ్యలను ఆయన అభినందించారు.

కుప్పకూలిన పురాతన భవనం : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నగరంలోని పూర్ణా మార్కెట్ జంక్షన్ సమీపంలో ఒక పాత భవనం కుప్పకూలింది. బుధవారం జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... 36వ వార్డు పరిధి రంగిరాజు వీధిలో కెజిహెచ్‌ను ఆనుకొని ఇసుక కొండ ఉంది. కొండపై సుమారు 20 ఏళ్ల క్రితం చల్లపల్లి కుంచయ్య జి ప్లస్ వన్ పద్ధతిలో ఇల్లు నిర్మించారు. ఆ ఇంటిలో ఆయన నివసించడం లేదు. రెండు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. బుధవారం ఉదయం ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. ఆ సమయంలో ఆ ఇంటిలో నివసిస్తున్న వారు పనులు కోసం బయటకు వెళ్లారు. భమిడిపాటి భరణి (40), డేవిడ్ (14) గాయపడ్డారు. 108 ద్వారా గాయపడ్డ ఇద్దరినీ కెజిహెచ్‌కు తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయులో 'జగనన్న పచ్చ తోరణం'

ప్రజాశక్తి-విశాఖపట్నం : జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఆంధ్రా ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఫారెస్ట్ అధికారి అనంత్ శంకర్, ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాదరెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిటిజన్ పర్సెప్షన్ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-విశాఖపట్నం : సిటిజన్ పర్సెప్షన్ సర్వే పౌరుల అభిప్రాయంపై విశాఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు స్మార్ట్ సిటీ సిబ్బంది అవగాహన కల్పించారు. పౌరుల అభిప్రాయ సేకరణలోనూ, రేటింగులోనూ తమ అభిప్రాయలను తెలిపే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022లో భాగంగా జివిఎంసి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహించే సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో చురుకుగా పాల్గొనాలని, నగరంలో ప్రజల జీవన సౌలభ్యం, మెరుగుదల గురించి మీ అభిప్రాయాన్ని తెలియజేయాలని అభ్యర్థించారు.

విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ

మొదటి పేజీ తరువాయి...

ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుతోనే సుజ్ఞానంతో కూడిన భవిష్యత్తు ఉందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. భీమిలి నియోజక వర్గంలో 2049 మంది బాలికలకు, 2113 బాలురకు, 280 మంది ఉపాధ్యాయులకు కలిపి 4442 ట్యాబ్‌లు అందించినట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను సన్మానించారు. విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం ఎంపిపి శారద ప్రియాంక ఆధ్వర్యాన మండలంలో నిర్వహించిన వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘువర్మ, బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారామ్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎగ్జామినేషన్ దేవానంద్ రెడ్డి, డిఇఒ చంద్రకళ, ఎండిఒ లవరాజు, తహశీల్దార్ రామారావు, ఆనందపురం పాఠశాల కమిటీ చైర్మన్ చందక అప్పలస్వామి, ఎఇఒ పద్మావతి, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి 5వ జోన్ పరిధిలోని సెయింట్ పీటర్ హైస్కూల్‌లో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి 8వ తరగతి విద్యార్థులకు సాంసంగ్ బైజూస్ ట్యాబ్‌లను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 3,427 ట్యాబులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, ఫాదర్ జాన్ ప్రకాష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అర్బన్ సువర్ల పాల్గొన్నారు.

24లోగా ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : జగనన్న విద్యా దీవెన 2019-20 విద్యా సంవత్సరానికి (మే 2020 నుంచి అక్టోబర్ 2020 మధ్య దరఖాస్తుల ప్రొసెసింగ్‌కు అర్హులైన విద్యార్థులకు) ఈ నెల 27వ తేదీన బకాయిలను విడుదలచేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, దీని కోసం విద్యార్థులందరూ ఈ నెల 24వతేదీ లోగా ఇకెవైసి పూర్తిచేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ విశాఖ జాయింట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఇక్కడ లేకుంటే అందుబాటులో ఉండే సచివాలయాల్లో ఇకెవైసి చేయించుకోవచ్చని తెలిపారు. అదీ వీలు కాకపోతే తల్లిదండ్రులైనా సరే ఇకెవైసి చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

27 నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్ : జెసి

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 27 నుంచి జనవరి 7వ తేదీ వరకు పోలమాంబ గుడి వెనుక ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహించే 'సరస్' అఖిల భారత డ్వాక్రా బజార్-2022 ఎక్సిబిషన్ కోసం ఏర్పాట్లు పక్కాగా చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డ్వాక్రా బజార్ ఏర్పాటుకు డిఆర్‌డిఎ పీడీ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని 20 రాష్ట్రాలు ఈ డ్వాక్రా బజార్‌లో పాల్గొంటాయని తెలిపారు. కంట్రోల్ రూమ్, పార్కింగ్, ట్రాఫిక్ ఏర్పాట్లపై పోలీస్ శాఖకు, అంబులెన్సు, మెడికల్ క్యాంపు ఏర్పాట్లపై వైద్య ఆరోగ్య శాఖ పలు సూచనలు చేశారు. జీవీఎంసీ ద్వారా పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, తాగు నీరు, సుందరీకరణ పనులు చేయాలన్నారు. డ్వాక్రా బజార్ జరుగు పది రోజులు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్ఇకి, ఫైర్ ఫైటర్స్ అందుబాటులో ఉంచాలని అగ్ని మాపక ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. డ్వాక్రా బజార్‌లో మొబైల్ ఎటిఎమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, ఎల్‌డిఎమ్.శర్మ, జిఎండిఐసి గణపతి, జీవీఎంసీ, హెల్త్, పోలీస్, ఫైర్, ఎపి ట్రాన్స్‌కో, బ్యాంకు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా సిఎం జగన్ జన్మదిన వేడుకలు



భీమిలిలో వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

భీమునిపట్నం : నాలుగోవార్డు మంగమారిపేటలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆధ్వర్యంలో 300 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఒకటో వార్డు, చిట్టివలస బంతాట మైదానంలో రక్తదాన శిబిరాన్ని వైసిపి నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, పార్టీ వార్డు అధ్యక్షులు జగుపిళ్ల ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జివి రమణ, తమ్మిన అశోక్ పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణరాజు, అతని స్నేహితుల ఆర్థికసాయంతో సమకూర్చిన నాలుగు వీల్‌చైర్లను నలుగురు వికలాంగులకు అందజేశారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ డి పెదబాబు, ఎంపిడిఒ పి వెంకటరమణ, పొట్నూరు చంద్రశేఖర్, గాడు శ్రీను పాల్గొన్నారు. టి నగం పాలెంలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.

ఆరిలోవ : సిఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని 11వ వార్డు అమ్మా నాన్న ట్రస్టు ఆధ్వర్యంలో, వైసిపి సీనియర్ నేత ఇజ్జాడ సత్యనారాయణ, సర్యప్రభ దంపతుల సహకారంతో జివిఎంసి నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని అందించారు. వైసిపి నేత గొలగాని శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు బోని శ్రీను పాల్గొన్నారు.

13వ వార్డు, ఆరిలోవ కాలనీలో వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు వానపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొని సిఎం జగన్ జన్మదిన కేక్‌ను కట్ చేసారు. పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేసారు. వైసిపి నేతలు గూడపాటి విక్టర్, బాలరాజు, వెంకట్, పారిపల్లి రామారావు, సత్యాల సాగరిక పాల్గొన్నారు.

13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో... ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి సిఎం జగన్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. వార్డు ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, శిరీషా, వెంకటరెడ్డి, గోవిందు, బాబూరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. జన్మదిన కేక్‌ను కట్ చేసి, జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరాలు, వృద్ధులు, అనాధలకు దుప్పట్లు, బట్టలు, మహిళలకు చీరలు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, అన్నసమారాధనలు, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు పండుగను తలపించాయి. విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పార్టీజిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మారిటైం బోర్డు చైర్మన్ కాయ వెంకటరెడ్డితో కలిసి కెకె.రాజు కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరంలో కెకె.రాజుతోపాటు యువకుల స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పేదలకు బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత బొడ్డేటి కాశీవిశ్వనాథం, కార్పొరేటర్లు



సీతమ్మధారలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ, మేయర్, కెకె.రాజు

చొక్కాకుల లక్ష్మి వెంకటరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఎపి యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత ఆధ్వర్యంలో విశాఖలోని ఆమె స్వగృహంలో జగన్ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు, పోలవరపు అప్పారావు, పూడి అప్పారావు, పూడి సంజీవి, గొంప అప్పలరాజు, బత్తిన బంగారాజు, కుప్పా మురళి, కుప్పా మోహనరావు, పోలవరపు ప్రసాదు, లావేటి రాజు, లావేటి హేమసుందర్, సంపంగి మంగరాజు వైస్ ప్రెసిడెంట్ బసరమని ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గొడ్డు కన్నారావు పాల్గొన్నారు.

పద్మనాభం: మండల కేంద్రంలోఎంపిపి కంటుబోతు రాంబాబు ఆధ్వర్యంలో సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా భారీకేక్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కట్ చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలు సిహెచ్ స్వాతి, కె.వెంకటలక్ష్మి, ఎం.పూజితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కస్తూర్బా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మెగా రక్తదాన శిబిరంలో 80మంది రక్తదానం చేశారు.

ఎంవిపి కాలనీ : మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని వైసిపి కార్యాయంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. అనంతరం ఎపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పరావు నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించి 250 యూనిట్లు రక్తం సేకరించారు.

ఎంవిపి.కాలనీలోని వైసిపి కార్యాలయంలో అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యాన రక్తదానం శిబిరం నిర్వహించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొన్నారు. శివాజీ పాలెంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. టిఎస్ఆర్ కాంప్లెక్స్ నైట్ షెల్టర్‌లోని నిరాశ్రయులకు సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య సమన్యకర్త సనపల నారాయణస్వామి చీరలు పంపిణీ చేశారు. లా సన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమంలోని డెప్ స్కూల్లో వైసిపి మహిళా నేత రమ్యశ్రీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మధురవాడలో జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ : ఎనిమిదవ వార్డు సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని అంధుల పాఠశాలలో వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు సందర్భంగా వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు పాల్గొని, కేక్ కట్ చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నా ఎల్లయ్య పాల్గొన్నారు.

5వ వార్డు మారికవలస రాజీవ్ గృహకల్ప కల్యాణ మండపంలో సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసిపి ఎన్నికల సలహాదారు పసుపులేటి బాలరాజు పాల్గొని వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతరావుఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 7వ వార్డు మధురవాడ పిహెచ్‌సి వద్ద పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు

సింహాచలం: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 98వ వార్డు వైసిపి అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, ఎర్రవరం బాబు ఆధ్వర్యంలో సింహాచలం తొలిపావంచా వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కర్రి సత్తిబాబు, దొంతల సంతోష్, పీతల అప్పలరాజు పాల్గొన్నారు.



కంచరపాలెంలో క్రికెట్ విజేతలతో మంత్రి అమర్, కెకె.రాజు

క్రికెట్ విజేతలకు బహుమతుల పంపిణీ

కంచరపాలెం : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యంలో కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో నిర్వహించిన జెఎంఆర్ కప్ క్రికెట్ మ్యాచ్ విజేతలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి కెకె.రాజు నగదు బహుమతిని అందజేసారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్, వికెపిసిపిఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, మాధవి వర్మ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాస్ రావు, కంపా హనోక్,అల్లు శంకరరావు, బర్కత్ ఆలీ, అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మ రెడ్డి, ఆళ్ళ లీలవాతీ, ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకట్ రమణ, కెవిఎన్. శశికళ, పేడాడ రమణికుమారి, బి.కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

కంచరపాలెం : సిఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్ దరి వానప్రస్థ వద్ధాశ్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని కేక్ కట్ చేసి వృద్ధులకు ఇచ్చారు. అన్నదానం చేశారు. 15 లీటర్ల సామర్థ్యం గల వాటర్ గీజర్‌ను ఆశ్రమం నిర్వాహకులకు అందజేసారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సాడి పద్మారెడ్డి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబెర్ సంపంగి శ్రీను, ఆదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు

గాజువాక. : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు, బట్టల, దుప్పట్లు పంపిణీ చేశారు. దొడ్డి రమణ ఆధ్వర్యంలో నడుపూరులో పేదలకు చీరలు పంపిణీ చేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి వైసిపి కార్యాలయంలో నేతలు దానప్పలు, దామోదర్ పాల్గొని చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

పెందుర్తి : 96వ వార్డు పెందుర్తిలో ఎన్నికల పరిశీలకులు శరగడం చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. క్రికెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. 94వ వార్డు నాయుడుతోట దరి అప్పలనరసయ్యకాలనీలోని వైసిపి కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, వైసిపి నగర ప్రతినిధి వై నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కంచిపాటి జగదీష్, ఆవగడ్డ సోమునాయుడు, పాల్గొన్నారు.



ఆరిలోవలో అమ్మనాన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



పద్మనాభంలో కోలాటంతో సందడి చేస్తున్న మహిళలు



సింహాచలంలో తొలిపావంచా వద్ద వైసిపి నేతల పూజలు



పెందుర్తిలో చీరలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

చెట్టు కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకు జాతీయ రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్టు కొమ్ములను గురువారం జివిఎంసి అధికారులు తొలిగించారు. రోడ్డును కమ్ముకునేలా చెట్లు పెరిగి, వాహనదారులు, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో సమస్యను స్వయంగా పరిశీలించిన పిఎం.పాలెం ట్రాఫిక్ సిఐ విజయకుమార్ స్పందించి జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సాయంతో స్టేడియం నుంచి కొమ్మాది వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



పనులు పర్యవేక్షిస్తున్న సిఐ విజయకుమార్

అంగన్వాడీ పోస్టులకు 31లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కంచరపాలెం : ఐసిడిఎస్ అర్బన్ -1 , 2 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు స్వీకరిస్తునట్లు ఐసిడిఎస్ అర్బన్ -1 సిడిపిఒ రమణ కుమారి, ఐసిడిఎస్ అర్బన్ -2 సిడిపిఒ శ్రీలత బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఐసిడిఎస్ అర్బన్ -1 పరిధిలో 20 ఆయా పోస్టులు, ఐసిడిఎస్ అర్బన్ -2 పరిధిలో రెండు అంగన్వాడీ కార్యకర్తలు , 11 ఆయా పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు వార్డుల వారీగా కేటాయించిన రోస్టర్ పద్ధతిలో తగిన ధ్రువపత్రాలతో సంబంధిత సిడిపిఒ కార్యాలయంలో ఈనెల 22 నుండి 31వ తేది సాయంత్రం 5 గంటల లోపు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కెరీర్ గైడెన్స్, రుతుక్రమ సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్యూర్, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ప్రాజెక్ట్ రైజ్ పేరిట కెరీర్ గైడెన్స్, పీరియడ్ లిటరసీపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్యూర్ సిఇఒ శైల తాళ్లూరి తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024 మార్చి నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని 7 వేల ప్రభుత్వ స్కూల్స్ లో చదువుతున్న విద్యార్థినులకు ఈ అవగాహన కార్యక్రమం పూర్తి చేయాలన్నది తమ లక్ష్యం అన్నారు. నిర్మాణ్ సిఇఒ మయూర్ పట్నాల మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులందరికీ కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్యూర్ మేనేజర్ కె.పద్మ, డాక్టర్ అపర్ణ, రేష్మా జైన్, ధ్రువ్, విజయభాను, నిర్మాణ్ కో సిఇఒ ఉమా కేశాని, సీనియర్ మేనేజర్ సిహెచ్ లతాకుమారి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శైల తదితరులు

యూనియన్ నేత ప్రసాద్‌కు ఘన సన్మానం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న డాక్‌యార్డు రిటైర్డు ఉద్యోగులు

ప్రజాశక్తి -కరాస: నేవల్ సివిల్ యూనియన్ ఉద్యోగులకు అత్యున్నత సేవలు అందించిన కెబిఆర్ఆర్ ప్రసాద్‌ను బుధవారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శాంతినగర్ హస్మీ భవనంలో డాక్‌యార్డ్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత ఉద్యోగులు గజమాలతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్మిక సంఘం నేతగా, కార్మికుల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారన్నారు. ఐఎన్‌సిఈ యూనియన్‌కు దీర్ఘకాలంపాటు గౌరవాధ్యక్షునిగా కొనసాగి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌కె.రాజు, జి శ్యాంప్రసాద్, ఎం చంద్రశేఖర్, మౌలాలి, టి రామ్మోహనరావు, ఆర్.కొండబాబు, పిఎస్ఎన్ మూర్తి, పిఆర్ కుమార్, టివి.రమణ, ఎంఎస్ లింగం, ఎంపీ దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలి

ఎయు రెక్టార్ ప్రొఫెసర్ సమత



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె సమత

ప్రజాశక్తి -తగరపువలస : ఆలోచనలు ఎప్పుడూ సృజనాత్మకంగా ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఎంటర్‌టైన్‌మెంట్, మెడిటేషన్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కష్టపడే తత్వం ఉండాలని స్పష్టం చేశారు. సమయం చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మన శ్రేయస్సును, మంచిని కోరే స్నేహితులను ఎంచుకోవాలని, ఆత్మ విశ్వాసం, ధైర్యంతో, సానుకూల దృక్పథంలో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎయు విశ్రాంత ఆచార్యులు కె చందుసుబ్బారావు, అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒ వి.త్రినాథరావు పర్యవేక్షణలో 41 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ1,47,63,767 నగదు వచ్చిందన్నారు. దీంతోపాటు 152.400 గ్రాముల బంగారం, 10.070 కిలోల వెండి, వివిధ దేశాల కరెన్సీ నోట్లు కూడా లభించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం కేవలం 10 హుండీల్లోని కానుకలను మాత్రమే లెక్కించామని, మిగిలిన హుండీలను త్వరలో తెరిచి లెక్కిస్తామని అధికారులు తెలిపారు

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత పద్మ

ప్రజాశక్తి -కంచరపాలెం : రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి పద్మ డిమాండ్ చేశారు. బుధవారం. కంచరపాలెం సిఐటియు కార్యాలయం వద్ద రజక వృత్తిదారుల సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ,. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రజక వృత్తిదారులు కులవృత్తిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో సాంప్రదాయ రజక వృత్తిలో ప్రైవేటు వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టి వీరి ఉపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. రజక వృత్తిలో లాండ్రీలు, డ్రైక్లీనింగ్ షాపులు, సంచార లాండ్రీలకు పెట్టుబడి లేక రజకులు వృత్తి కోల్పోతున్నారన్నారు. రజకుల ఉపాధికి వీరి సొసైటీ ద్వారా సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఈశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బిసి కార్పొరేషన్లు, సహాయక సంఘాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలకు కార్పొరేషన్ పెట్టినా, వాటికి నిధులు లేకుండా నామమాత్రం చేశారని విమర్శించారు. రజక సంక్షేమం పట్ల జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధనకు రజకులంతా ఐక్యంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టి రాము, బి రాము, కె ధనుంజయ్, ఒ.దుర్గారావు, ఎన్ దేవి, ఎం చిన్నారావు, కె.సింహాద్రి, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు

కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి- వేపగుంట : ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోపాలపట్నంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు వి వెంకటరావు మాట్లాడుతూ ఫుడ్ గ్రైడ్స్ ఏషియన్, ముఠా వర్కర్స్ యూనియన్ మధ్య కుదిరిన ఒప్పంద కాలం ముగిసినప్పటికీ, నూతన ఒప్పందం చేసుకునేందుకు యాజమాన్యం ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కుటుంబాలతో చాలీచాలని కూలితో కూలీల జీవనం దుర్భరంగా సాగుతోందని, ఈ నేపథ్యంలో నూతన ఒప్పందం చేసుకుని, ముఠా కార్మికులకు కూలి రేట్లను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముఠా కార్మికులు పైడపునాయుడు, పైడన్న, నగేష్ పాల్గొన్నారు

ఘనంగా 'ఆపిల్ ఐ' పాఠశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి గాజువాక : గాజువాక శ్రీనగర్‌లోని ఆపిల్ ఐ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం తొమ్మిదవ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సమాజంలోని విద్యావంతులైన తల్లిదండ్రులు తమ పిల్లలను మార్గదర్శకులుగా నిలిచి ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు.

'ఒకిడ్స్' స్కూల్ చైర్మన్ యార్లగడ్డ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ఉన్నత విద్యనందిస్తున్న ఆపిల్ ఐ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. మరో విశిష్ట అతిథి రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ అధినేత కంచర్ల రమేష్ మాట్లాడుతూ పిల్లల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు మెలగాలని కోరారు. సెల్‌ఫోన్, టీవీలకు తమ పిల్లలను ఎంతదూరంగా ఉంచితే అంతే మంచిదన్నారు. ఆపిల్‌ఐ స్కూల్ చైర్మన్ టి. బలరామకృష్ణ మాట్లాడుతూ, మొత్తం జీవితాన్ని పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశామన్నారు.

ఈద్గా స్థలం కోసం ముస్లిముల వినతి



ఆర్అండ్‌బి ఎస్ఇకి వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి -కంచరపాలెం : మద్రిపాలెంలోని ముస్లిముల నమాజ్‌కు అవసరమైన ఈద్గా స్థలాన్ని కేటాయించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి ఎస్ఇ కె.జాన్‌సుధాకర్‌ను కలిసిన మద్రిపాలెం మస్జీద్ అల్ ఫత్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. తమ మస్జీద్‌కు స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా, ఆయన స్పందించి పిఎం.పాలెంలో స్థలం కేటాయించారని, అయితే మద్రిపాలెం ప్రాంత ముస్లిములు ప్రార్థనలు, నమాజ్‌కు అంతదూరం వెళ్లడం సాధ్యం కాని పరిస్థితుల్లో తమకు అందుబాటులో మద్రిపాలెం ప్రాంతంలోని ఏదైనా ఆర్అండ్‌బి స్థలాన్ని మస్జీద్‌కు కేటాయించాలని కోరారు. దీనిపై గతంలోనే విశాఖ జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒలకు విన్నవించామన్నారు. తమకు మద్రిపాలెంలో స్థలం కేటాయిస్తే, దానికి ప్రతిగా తమకు పిఎంపాలెంలో కేటాయించిన స్థలాన్ని ఆర్అండ్‌బి శాఖకు ఇచ్చేస్తామని విన్నవించారు. దీనిపై ఎస్ఇ స్పందిస్తూ, విషయాన్ని ఆర్అండ్‌బి శాఖ ఉన్నతాధికారులకు నివేదించి, ముస్లిములకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్, సుభాన్, బాబా పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూపార్కులో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆధ్వర్యంలో జూపార్కు పరిసరాల సుందరీకరణలో భాగంగా బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఎసిఎఫ్) జి.మంగమ్మ పాల్గొని వివిధ రకాల పూల మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

11వ వార్డులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఆరిలోవ : 11వ వార్డు టిడిపి ఆధ్వర్యంలో ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో బుధవారం ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు.ఇంటింటికి వెళ్ళి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి కార్యదర్శులు మూది అప్పారావు, కృష్ణంరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంచార జాతులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్న పలువురు సంచార జాతుల వారికి స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి దుప్పట్లు, ఆహారం, బిస్కెట్లు అందజేశారు. తన తండ్రి భాస్కరరావు జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్లు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గోశాలకు రోటోవేటర్ వితరణ



ఇఒ, ట్రస్ట్ బోర్డు సభ్యులకు పరికరాన్ని అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో వ్యవసాయానికి అవసరమైన రూ. లక్ష విలువ చేసిన రోటోవేటర్‌ను బోయిన జనార్ధనరెడ్డి, భాస్కరరెడ్డి బుధవారం సంయుక్తంగా అందించారు. సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ట్రాక్టర్‌తో నడిచే రోటోటిల్లెజ్ పరికరాన్ని దేవస్థానం ఇఒ వి త్రినాథరావుకుఅందజేశారు. బుధవారం ఈ పరికరంతోనే భూమిని చదును చేసి గులాబీ మొక్కలను నాటారు.కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, శ్రీదేవి వర్మ, శ్రీదేవి పాల్గొన్నారు. 1

ముగిసిన హెచ్ఎంల శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మండలంలోని హెచ్ఎంలకు, సిఆర్‌పిలకు గడచిన తొమ్మిది రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. తరగతిలో బోధన, పరిశీలన అంశాలపై శిక్షణ పొందిన వారంతా క్షేత్రస్థాయిలో పక్కగా అమలుకు ప్రయత్నించాలని కోర్సు డైరెక్టర్, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు సూచించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి 41 మంది శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ముగింపు సమావేశంలో శిక్షణనిచ్చిన ఆర్‌పిలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్, అధ్యాపకులు నాగేశ్వరరావు, జె మాధవి, ఎస్‌కె అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిన్నపాటి వర్షం కురిసినా, సబ్బివానిపేట సర్వీస్ రోడ్డులో పెద్దఎత్తున నిలిచిపోతున్న వర్షపునీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్ కోరారు. వర్షం కురిసి, వెలిసిపోయిన తర్వాత కూడా సర్వీస్‌రోడ్డులో నీరు నిలిచే ఉంటోందని, దీని వల్ల వాహనదారులతోపాటు పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జివిఎంసి ఒకటో జోన్ అధికారులు స్పందించి, సబ్బివానిపేట వద్ద సర్వీస్ రోడ్డులో నిలుస్తున్న నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

★ రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్

★ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక జివిఎంసి బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను బుధవారం మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి విద్యార్థికి రూ.40 వేలు విలువైన ట్యాబ్‌లను రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి రూ.650 కోట్లు ఖర్చు చేసి అందజేస్తుందని చెప్పారు. 2019 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో 38 లక్షల మంది విద్యార్థులు ఉండగా నేడు 45 లక్షలకు చేరిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చూసి కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎంఈఓ దివాకర్, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ అనంతరం విద్యార్థులతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

అదనపు ఎస్పీగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీగా పి.సత్యనారాయణ బుధవారం ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ పరిపాలన విభాగంలో పని చేసిన ఆయన బదిలీపై అనకాపల్లి జిల్లాకు వచ్చారు. 1989 బ్యాచ్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన డిఎస్‌పి వరకు రేంజ్ పరిధిలో వివిధ ప్రదేశాల్లో పని చేశారు. 2020లో ఉద్యోగోన్నతిపై విజయనగరం అదనపు ఎస్పీగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ గౌతమి శాలి, అదనపు ఎస్పీ పరిపాలన విజయ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయ సిబ్బంది అదనపు ఎస్పీ సత్యనారాయణను కలసి అభినందనలు తెలియజేశారు.



వైద్య సేవల కోసం వచ్చిన రోగులు

'జాగృతి' ఆధ్వర్యాన వైద్య సేవలు

ప్రజాశక్తి- సబ్బవరం : జాగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ సంస్థ ఎమ్‌డి కె.సుజాత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ సంస్థకు చెందిన 65 మంది సభ్యులను విశాఖలోని గాయత్రి హాస్పిటల్‌కు బస్సులో తీసుకెళ్లి వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరిలో 22 మందికి కీళ్ల నొప్పులు, 12 మందికి నేత్ర పరీక్షలు, 8 మందికి ఆర్థోపెడిక్, 13 మందికి గైనిక్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఈఓ కె.మౌక్తిక, సుబ్రహ్మణ్యం, బి.విజయ, కె.అరుణ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

27న జగనన్న విద్యా దీవెన బకాయిలు విడుదల

24లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న విద్యా దీవెన 2019-20 సంవత్సరానికి సంబంధించిన బకాయిలను ఈనెల 27న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విడుదల చేయనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి టి.అజయ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 మే నుంచి అక్టోబర్ మధ్య దరఖాస్తు ప్రాసెసింగ్‌కు అర్హులైన విద్యార్థులకు ఈ బకాయిలు విడుదల అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 24లోపు తమ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒకవేళ విద్యార్థులు వేరే చోట ఉద్యోగం చేస్తున్నా, వేరే ప్రాంతాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లినా తమ దగ్గరలోని సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని, లేదంటే వారి తల్లిదండ్రులు కూడా ఈకేవైసీ చేయించవచ్చని వెల్లడించారు.

తప్పులకు ఆస్కారం లేకుండా సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా చేస్తున్న సమగ్ర భూ రీ సర్వే ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీషరాణి ఆదేశించారు. మండలంలోని నునపర్తి పంచాయతీ పరిధి జిపి అగ్రహారం గ్రామ కంఠం అబాదీ రీ సర్వే పనులను ఆమె బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఎల్‌పిఓ మూర్తి, ఇఓపిఆర్‌డి ఎం.రాధిక, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, విఆర్ఓ అనంతరావు, సర్వేయర్ గిరీష్, ఉప సర్పంచ్ యాండ్ర పైడిరాజు, మండల బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- సబ్బవరం : జివిఎంసి పరిధి దువ్వాడకు చెందిన బోయల గురవయ్య అకాల మరణం చెందడంతో, ఆయన భార్య బోయల సుమనకు రూ.50 వేలు బీమా చెక్కును బుధవారం జాగృతి స్వచ్ఛంద సంస్థ ఎమ్‌డి కె.సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఈఓ మౌక్తిక, ప్రతినిధులు జి.ప్రసాద్, వరలక్ష్మి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలని వినతి

ప్రభుత్వ నిబంధనలు రైతుల పాలిట ఉరి తాళ్లు



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న రైతు నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, రైతు సంఘం నాయకులు కాళ్ల తేలయ్యబాబు, బుద్ధ రంగారావు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు క్షేత్రాలకు వ్యవసాయ అధికారులు రాకుండానే పంట నష్టాలను ఎలా అంచనా వేస్తారని ప్రశ్నించారు. పంటలో మూడో వంతు పూర్తిగా నష్టపోతేనే పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం నిబంధన రైతుల పాలిట ఉరితాడుగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులను, కౌలుదారులను గుర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని కోరారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.

చెస్ బాక్సింగ్ క్రీడాకారిణి

అరుణకు బ్రాండిక్స్ రూ.లక్ష ఆర్థిక సాయం



అరుణకు చెక్కు అందజేస్తున్న దొరస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

చెస్ బాక్సింగ్ క్రీడాకారిణి కోరుకొండ అరుణకు బ్రాండిక్స్ సంస్థ లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించి బాసటగా నిలిచింది. అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెంకు చెందిన అరుణ వరల్డ్ చెస్ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతాకాన్ని సాధించింది. గ్రామీణ కుటుంబంలో జన్మించి.. పేదరికాన్ని అధిగమించి ఘన కీర్తిని చాటుతున్న అరుణకు బ్రాండిక్స్ సంస్థ భారతీయ భాగస్వామి దొరస్వామి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న బ్రాండిక్స్ యువతకు, ముఖ్యంగా మహిళలు క్రీడలతో సహా అన్ని రంగాల్లో రాణించేందుకు చేయూత ఇచ్చేందుకు ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. అరుణ అంతర్జాతీయ చెస్ బాక్సింగ్‌లో తన ప్రతిభను చాటుకుని ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ సంస్థ ప్రతినిధులు శరవణన్, ఉదిత వీరబాహు, చరిత తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని మర్రివలసలో సీనియర్ నాయకుడు పొంతపల్లి రామారావు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు మాట్లాడుతూ వ్యవస్థాపక దినోత్సవం నేపథ్యంలో ఈనెల 26 వరకు అన్ని గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించి, పార్టీ ఆశయాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇల్లాకు రాము, సీముసిరి రామనాయుడు, రెడ్డి అప్పలనాయుడు, చప్ప కోటి, సీముసురు సూర్యనారాయణ పాల్గొన్నారు.

10 గ్రామాల్లో క్షయ వ్యాధి సర్వే

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలోని 10 గ్రామాల్లో క్షయ వ్యాధి సర్వే నిర్వహించనున్నట్టు జిల్లా క్షయ నివారణ అధికారి శారద బాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నాటికి క్షయ వ్యాధిని సమూలంగా నివారించాలని ఉద్దేశంతో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఇద్దరు వాలంటీర్లు ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని సరుగుడు, కోట్నాబిల్లి, పొట్టిదొరవానిపాలెం, వీరభద్రపేట, పెద్ద ముషిడివాడ, నాగవరం, పెదపూడి అగ్రహారం, రాజయ్యపేట, పాయకరావుపేట, మామిడిపాలెం గ్రామాల్లో సుమారు లక్ష మందిని సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. కళ్లే పరీక్ష నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే తక్షణమే చికిత్స ప్రారంభిస్తామని తెలిపారు.

పౌష్టికాహార సహాయానికి దాతలు ముందుకు రావాలి

టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార సహాయానికి దాతలు ముందుకు రావాలని డాక్టర్ శారదాబాయి పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లా అధికారులు పలువురు ముందుకొచ్చి టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని పౌష్టికాహారానికి తమ విరాళాలను అందజేస్తున్నారని తెలిపారు.

ఆదర్శనీయులు పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశం గర్వించదగ్గ ఆదర్శనీయులు పొట్టి శ్రీరాములు అని పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిరాట్ల నరసింహమూర్తి అన్నారు. పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక ముదిరాజ్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి, పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గల 100 పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీ సత్యనారాయణ, గోవింద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది వంతెనపై రైలింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వద్ద పెద్దేరు నది వంతెనపై రైలింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల గోవాడ సుగర్ ఫ్యాక్టరీ నిధులతో వంతెన మధ్య భాగంలో ఇటీవల రాళ్లు పేర్చి తాత్కాలిక మరమ్మతులు చేసిన విషయం విధితమే. ఈ వంతెనపై రవాణా పునరుద్ధరించిన నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి అధికారులు వంతెనకు ఇరువైపులా ఇనుప రైలింగ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. దీంతో వంతెనపై రాకపోకలకు అనువుగా మారింది. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు మార్గం సుగమమైంది.



బ్రిడ్జిపై రైలింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువు



ఉమ్మలాడలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని ఉమ్మలాడలో మంగళవారం రాత్రి ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కడుపు నింపే అన్న క్యాంటీన్లను తొలగించడం దారుణమన్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి విడదీసి పాలించాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లేటి నారాయణరావు, పల్లె రాజు, దొడ్డి శ్రీనివాసరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, కొరపాటి వీర రాజశేఖర్, ముల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : సంక్షేమ పథకాల పేరిట ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం పట్టణంలోని చేపల బజారు, నెయ్యిల వీధి, ఉప్పలవారి వీధి, తోటకూర వీధి ప్రాంతాల్లో 84 వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి, నీలబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల రత్న కుమారి, కసిరెడ్డి సత్యనారాయణ, సాలాపు మోహన్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని రామగిరి పంచాయతీ వార్డు మెంబర్ వందనాల రమణమ్మతో పాటుగా మరో ఐదుగురు స్థానిక శాసనసభ్యులు యువి.రమణమూర్తి రాజు సమక్షంలో బుధవారం వైసిపిలో చేరారు. వారికి రాజు కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, రామగిరి వైసిపి నాయకులు పక్కుర్తి బాబూరావు, పల్లా రాజు, ధూళిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలో సంపతి పురం గ్రామ ఉప సర్పంచ్ ఎల్లంశెట్టి వెంకటలక్ష్మి బుధవారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ సమక్షంలో బుధవారం వైసిపిలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి పూల గుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, పల్లా శ్రీను, పోతల శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబుకు సన్మానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

యలమంచిలి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తి చేసిన సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజును, డిసిసిబి మాజీ చైర్మన్ యు.కుమారవర్మను వైసిపి నాయకులు సాలువా కప్పి జ్ఞాపక అందజేసి సత్కరించారు. అచ్యుతాపురం వైసిపి కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన లచ్చన్న నాయుడు, కె.విమల నాయుడు, ఎస్ జగ్గారావు, గొర్లి నూకరాజు, పిన్నమరాజు వాసు, సర్పంచులు ఎంపిటిసీలు పాల్గొన్నారు.

52వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసితులు నేవీ మెయిన్ గేట్ ముందు చేపట్టిన ఆందోళన 52వ రోజుకు చేరింది. బుధవారం ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు రోడ్డు బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 52రోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఎనిమిది గ్రామాలు ప్రజలతో అనకాపల్లి కలెక్టరేట్‌కు పాదయాత్ర నిర్వహించి ముట్టడిస్తామని హెచ్చరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-వడ్డాది : మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో బుధవారం మొక్కల నాటడం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతూ మొక్కలు వల్ల వాతావరణం కాలుష్యం తగ్గించని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ బి.గోరీను, సెక్షన్ ఆఫీసర్లు ఎ.నూకరాజు ఓఎస్ఎన్.మూర్తి, వన సేవకులు గొన్నబత్తుల ముత్యాలు, ఎస్ నాయుడు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : సంపద కేంద్రాల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి అన్నారు. మండలంలోని గణపర్తి గ్రామంలో సంపద కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వాలంటీర్లకు, క్లాప్ మిత్రాలకు పలు సూచనలు చేశారు. సంపద కేంద్రాల పరిరక్షణ, మొక్కల పెంపకం బాధ్యత పంచాయతీ కార్యదర్శి వాలంటీర్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్, ఈవోపిఆర్డి పి.ఈశ్వరరావు, సర్పంచ్ చదరం గణేష్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ శిరీషరాణి

మాచర్ల దోషులపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేతలు నాగజగదీష్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మాచర్ల చోటుచేసుకున్న సంఘటనలో దోషులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎస్పీ గౌతమి శాలికి టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి పల్నాడులో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందన్నారు. జరుగుతున్న పరిణామాలపై టిడిపి శ్రేణులు డిజిపి, ఎస్పీలకు మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈనెల 16న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేత బ్రహ్మానంద రెడ్డిపైనా, పార్టీ నాయకులపైనా వైసిపి గుండాలు దాడులు చేశారని, బ్రహ్మానంద రెడ్డి ఇంటిని దగ్ధం చేశారని తెలిపారు. ఇంత మారణకాండ జరిగినా పోలీసులు కనీసం వారిపై కేసులు పెట్టకుండా బాధితులపైనే కేసులు పెట్టి గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్మోహన్, మళ్ల గణేష్, దొడ్డి జగదీష్, గుర్రాల వాసు, వానపల్లి కోటేశ్వరరావు, బుద్ద మహాలక్ష్మి నాయుడు, అండిబోయిన శేషు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని కింతాడ గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతుందని లేనిది అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నపిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింతాడ సచివాలయ పరిధిలో రూ.18 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి అనురాధ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అంగన్వాడీలో చిన్నారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి

మునగపాక రూరల్ : మండలంలోని కొత్త నాగవరం గ్రామంలో స్థానిక శాసనసభ్యులు యువి రమణమూర్తి రాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం ప్రారంభించి బుధవారం నాటికి 100 రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు రమణమూర్తి రాజుతో పాటుగా ఆయన తనయుడు సుకుమార్ వర్మకు జ్ఞాపికలను అందించి వారిని సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో భాగంగా గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేశారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని జె.తుని, నరిశింగబిల్లి గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులను డిఇ ఎం.నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రైనేజీ సమస్యను స్థానికులు మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకురాగా, ఈ రెండు గ్రామాలకు రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ పావని, సర్పంచ్ కొన అరుణ, సచివాలయం సిబ్బంది నీలం, వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు పాల్గొన్నారు



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న డిఇ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపిపి జయమ్మ

భూ సర్వేతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-చీడికాడ

మండలంలోని ఎల్లిపట్నం గ్రామంలో బుధవారం జగనన్న భూ సర్వే శాశ్వత భూ పట్టాలను ఎంపిపి కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్‌ల చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బివి రాణీ, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి ,ఉపసర్పంచ్ కురచా నారాయమూర్తి, వైసిపి మండల కన్వీనర్ గొల్లవిల్లి రాజబాబు, యూత్ కన్వీనర్ స్వామి నాయుడు వీఆర్వో కొండలరావు, సచివాలయం సర్వేయార్ ఆడారి సాయి పాల్గొన్నారు

పార్కులో విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-గొలుగొండ

అల్లూరి పార్కు విద్యార్థులతో నిండి పోయింది. బుధవారం కొయ్యూరు మండలంలో ఉన్న విద్యార్థులు పిక్నిక్ నిర్వహించారు. సుమారు 500 మంది వరకు విద్యార్థులు ఇక్కడికి వచ్చారు. విద్యార్థులు ఆట పాటలతో అలరించారు.

కోనాంలో గిరి నాగు హల్‌చల్

ప్రజాశక్తి-చీడికాడ

మండలంలోని కోనాం పంచాయతీ కేంద్రంలో గిరి నాగు హల్‌చల్ చేసింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరి నాగును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.కోనాం లోని సలుగు త్రినాధ స్వామి కల్లాల వద్ద మంగళవారం సాయంత్రం గిరి నాగు దర్శనమిచ్చింది. దీంతో రైతులు కేకలు వేయడంతో తుప్పల్లోకి వెళ్లిపోయింది. బుధవారం ఆ సమీప పొలం వద్ద మరలా కనిపించగా గ్రామస్తులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఈస్టర్ గార్డెన్స్ సొసైటీకి చెందిన పెచ్చట్ల వెంకటేష్, ప్రసాద్, మధులు గిరినాగును చాక చక్యంగా పట్టుకుని రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచి పెట్టారు. దీంతో, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రికి వనసమారాధన ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక వేమగిరి సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఈనెల 25న నిర్వహించే తూర్పు కాపు సంక్షేమ సంఘం వన సమారాధనకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు సంఘ ప్రతినిధులు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పలక రాము, ఎడ్ల త్రినాధరావు, సకల గోవిందు, పలక సత్యనారాయణ, తాకాసి అయ్యన్న దొర, గొన్నాబత్తుల వెంకటరమణ, సేనాపతి శ్రీను, కర్రి బాబి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రోలుగుంట : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో రోమన్ కేథలిక్ చర్చిలో కొత్తకోట విచారణ గురువు ఫాదర్ జోకబ్ ఆధ్వర్యంలో బుధవారం విశ్వాసులంతా కొవ్వొత్తులతో ప్రదక్షణ నిర్వహించారు. చర్చి నుండి ప్రారంభించి దళిత కాలనీ మీదుగా గ్రామ పురవీధుల్లో కొవ్వొత్తులతో ప్రదక్షణ చేశారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు గొప్పతనంపై గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట, రోలుగుంట, కొవ్వూరు గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వైసీపీ నేత శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో సారిపల్లివానిపాలెం కొబ్బరి తోటలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీలు మూడు రోజులపాటు హెూరాహెూరీగా జరిగాయి. పిడి కుందూరు రాజు కబడ్డీ పోటీలను నిర్వహించారు. నక్కపల్లి మండలం ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లివానిపాలెం జట్టు ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో విజేతగా నిలిచింది. ఎస్.రాయవరం మండలం, బంగారమ్మపాలెంకు చెందిన జట్టు రన్నర్‌గా నిలిచింది. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు షీల్డ్, రూ.10వేలు నగదు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.6వేలు నగదు ప్రోత్సాహన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శీరం నరసింహమూర్తి, చిక్కాల రామారావు, బొల్లం బాబ్జి, ఎలమంచిలి తాతబాబు, సూరకాసుల గోవింద్, లోడగల చంద్రరావు, శేషారత్నం , పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

27 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు జరిపిన వ్యక్తులు, వాటి తవ్వకాలకు ప్రోత్సహించిన 27 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ నెల 12న ఆరిలోవ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలపై నర్సీపట్నం సెక్షన్ అధికారులు గొలుగొండ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ తవ్వకాల్లో అడ్డలోవ, సుద్దలపాలెం, అప్పన్నపాలెం, కంఠారం, సాలికమల్లవరంకు చెందిన 27 మందిని గుర్తించి బైండోవర్ చేసి తహశీల్దార్ కోర్టులో బుధవారం హాజరు పరిచామన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు



అనకాపల్లిలో రక్తదానం చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైసిపి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. మొక్కలు నాటారు. క్రీడాపోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - అనకాపల్లి : ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు డివిఆర్ కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ సమక్షంలో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపిపి గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో గోపాలపురంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు.

బుచ్చయ్యపేట : మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఐతంపూడి, రాజాం గ్రామాల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వడ్డాది : వడ్డాది జిల్లా పరిషత్తు హైస్కూల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలితా నారాయణమూర్తి, వైసిపి నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక వైసిపి కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రి అమర్నాథ్ రక్తదానం చేశారు. వైసిపి పరిశీలకులు ఎస్ఏ రెహమాన్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి నాయకులు దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ సూరిబాబు సమక్షంలో కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరానికి సహకరించిన మంత్రిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఘనంగా సత్కరించింది.


దేవరాపల్లి : వైసిపి ఆధ్వర్యాన స్థానిక రైవాడ రిజర్వాయరు అతిథి గృహంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. అనంతరం జగనన్న భూరక్ష పథకం కింద పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు, దేవరాపల్లి జెడ్‌పిటిసిలు ఈర్లే అనురాధ, కర్రి సత్యం, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైస్ ఎంపిపి చింతల భూలక్ష్మి మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వైసిపి నాయకులు బూరె బాబురావు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక సంతబయలు వద్ద మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళు లర్పించారు. జడ్పీటీసీ పైల సన్యాసిరాజు కేక్ కట్ చేశారు. మరిడిమాంబ కల్యాణమండపం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు రాము నాయుడు, కోన రామారావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యాన మండలంలోని వాడ్రాపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్పంచులు దిమ్మల అప్పారావు, బీశెట్టి గంగప్పలనాయుడు బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కర్రి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నాయకులు కోటాన రాము పాల్గొన్నారు. మండలంలోని పైడివాడ అగ్రహారం సచివాలయం ప్రాంగణంలో నాయకులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలోనూ, అసకపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీను, ఆదినాయుడు ఆధ్వర్యంలోనూ మొక్కలు నాటారు.

కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్‌పిపి కలగా లక్ష్మి, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి కేక్ కట్ చేశారు. మొక్కలు నాటారు. వైసిపి నాయకులు మళ్ళ బుల్లి బాబు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దారు బి.సుధాకర్, సర్పంచ్ మంత్రి జయరజిని



పాయకరావుపేటలో దుస్తులు ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పాల్గొన్నారు. ఉగ్గినపాలెంలో సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, తాళ్ళపాలెంలో ఎంపిటిసి లగిశెట్టి భవాని ఆధ్యర్యాన సిఎం జన్మదిన వేడుకలు జరిగాయి.

అచ్యుతాపురం : ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా అచ్యుతాపురంలో వృద్ధ మహిళలకు ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతుల మీదగా చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేశారు. మండల వికలాంగుల పాఠశాల ఆవరణలో వికలాంగుల మధ్య బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్‌కు వైసీపీ నాయకులు పి వెంకటపతి రాజు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

చోడవరం : ముఖ్యమంత్రి జగన్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ చోడవరంలోని ఓ ప్రైవేట్ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను విప్ కరణం ధర్మశ్రీ బుధవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. రక్తదానం శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యరావు, వైసిపి నాయకులు పల్లా నర్సింగరావు, ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

కొత్తకోట:రాష్ట్ర రావికమతం మండలంలో మత్యవానిపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలు మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేసి చరిత్రలో నిలిచిన సీఎం జగన్ జన్మదిన వేడుకలు పండగలా రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవడం ఆనంద దాయకం అన్నారు. దుస్తులను, పండ్లను పేదలకు పంపిణీ చేశారు. జగనన్న లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్యా భవాని ప్రసాద్, గ్రామ సర్పంచ్ మలిసెట్ల గణేష్, ఎంపీటీసీ లోవరాజు, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ రాజాన నర్సింహులు, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సన్యాసినాయుడు, ఆగ్రో అడ్వైజర్ కమిటీ చైర్మన్ కంచిపాటి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు..

మాడుగుల:స్థానిక బస్ స్టాండ్ వద్ద రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక సేయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపిపి తాలపురెడ్డి రాజారాం, సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, షీలా మంతుల జ్యోతి, కుక్కర శ్రీధర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య కేకును కట్ చేసి పంపిణీ చేశారు.స్థానిక సిహెచ్‌సిలో రోగులకు రొట్టె, పాలు పంపిణీ చేశారు. హాకీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు పొడగట్ల పాపారావు, జడ్పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, వైసిపి నాయకులు అయినంపూడి మణి రాజు, గంటా తిరుపతిరావు, తళ్ళ భార్గవ్, కొల్లాటి బుజ్జి , నవర నూకరాజు శర్మ, సర్పంచులు జయ రత్న కుమారి, సాదిరెడ్డి శ్రీనివాసరావు, శంకర్రావు, హాకీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కే.తాతాజీ పాల్గొన్నారు .


నర్సీపట్నంటౌన్: స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని కొనియాడారు. డిసిసిబి చైర్ పర్సన్ అనిత సన్యాసి పాత్రుడు దంపతుల కుమారుడు వరుణ్ కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్నంలో వైఎస్ఆర్ విగ్రహానికి శాసనసభ్యులు గొల్ల బాబురావు, వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు.స్థానిక జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ వద్ద పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచ్ గార ప్రసాద్, జడ్పిటిసి లంక సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు బాబురావు, దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ, చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పార్వతీ తాతారావు, పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు

చీడికాడ:మండల కేంద్రంలో పార్టీ గ్రామ అధ్యక్షులు పరవాడ మహేష్, మండల కన్వీనర్ రాజబాబు ల ఆధ్వర్యంలో ఎంపీపీ కురిచ జయమ్మ, జడ్పిటిసి వేలం శారద వరలక్ష్మిలు కేక్ కట్ చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు, నాయకులు అప్పారావు లాలం జానకిరామ్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల:కైలాసపట్నం గ్రామంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గొల్ల బాబురావు పాల్గొన్నారు. మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

రోలుగుంట:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్లమెంట్ సభ్యురాలు బి.సత్యవతి ముందుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు.మండల అధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు, శెట్టిపల్లి వెంకటరమణ, యర్రంశెట్టి బాబురావు పాల్గొన్నారు. కుసర్లపూడి హైస్కూల్‌లో సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.



రోలుగుంటలో పండ్లు, రొట్టెలు పంపిణీచేస్తున్న ఎంపీ సత్యవతి



నర్సీపట్నంలో...



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

రాష్ట్రస్థాయి ఎడ్ల బళ్ల పోటీలు

ప్రజాశక్తి -చీడికాడ:ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని చుక్కపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలలో అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాల నుండి ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలో వరుస మూడు బహుమతులు కూడా కాకినాడ జిల్లా జిల్లాకు చెందిన ఎడ్లకు దక్కాయి. గెలుపొందిన వారికి మంత్రి బూడి ముత్యాల నాయుడు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట

ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -పాయకరావుపేట:రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఎంపీ బీవీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబురావు కొనియాడారు.పాయకరావుపేటలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ మేరకు ఆస్పత్రి ప్రహరీ గోడకు ఎలక్ట్రికల్ నిమిత్తం నిధులు మంజూరు చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ హాస్పిటల్‌ను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి అభివృద్ధి చైర్మన్ చిక్కాల రామారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, గారా ప్రసాద్ ఉషశ్రీ, జడ్పిటిసి లంక సూరిబాబు, ఎంపీపీ పార్వతీ తాతారావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, జగత శ్రీను, రామకృష్ణ, స్థానిక వైద్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడిలో తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖ సంయుక్తంగా డొంకాడ, రేబాక గ్రామాలలో ప్రస్తుతం మామిడి తోటలలో తీసు కోవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి మామిడి తోటలను సందర్శించారు. మామిడి తోటలలో తామర పురుగుల నివారణకు ఏసిఫేటే ఒక గ్రాము లేదా ఫిప్రోనిల్ రెండు గ్రాముల లీటర్ నీటి కలిపి పిచికారి చేసుకోవాని ఉద్యాన శాస్త్రవేత్త రామడుగు ప్రవీణ్ రైతులకు సూచించారు. పిందె దశలో ఆశించే కాయతొలుచు పురుగు నివారణకు సామూహికంగా పొలంలో సాయంత్రం 6 గంటల తర్వాత ఎండిపోయిన కొమ్మలతో మంటలు వేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో చేపట్టవలసిన వివిధ రకాలైన యాజమాన్య పద్ధతులపై సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఉమామహేశ్వరి, పలు రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

'మాస్ ప్లాన్' రోడ్లు వస్తే...

విశాఖ అభివృద్ధిని ఆపలేం!

- -ప్రభుత్వ రంగ సంస్థలతోనే రియల్ ఎస్టేట్‌కు ఊపు
- -మౌలిక వసతుల్లో పై ఓవర్‌లూ అత్యంత కీలకం
- -రుషికొండలో విల్లాస్ నిర్మాణాలకు అవకాశాలు
- -'ప్రజాశక్తి'తో క్రెడాయ్ చైర్మన్ బి.శ్రీనివాసరావు





ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరం, శివారు ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలంటే మాస్ ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్‌కు ప్రాధాన్యతను ఇవ్వాలి. విశాఖలో ఇప్పటికే రైల్వేలు, ఎయిర్‌పోర్టు, పోర్టులు 2, ప్రభుత్వ రంగ సంస్థలు అనేకం ఉన్నాయి. రియల్ ఎస్టేట్ రంగానికి ఇవే పెద్ద ఊపు. అంతేగాక మౌలిక వసతుల విషయంలో అవసరమైన చోట పై ఓవర్‌లు అత్యంత కీలకం" అని క్రెడాయ్ చైర్మన్ బి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ క్రెడాయ్ 8వ ప్రాపర్టీ ఎక్స్ పో షో ను నగరంలోని బీచ్‌రోడ్డు గాదిరాజు పేలస్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఆయన ఇచ్చారు.

రియల్ ఎస్టేట్ రంగం ఎలా ఉంది?

ఈ ఏడాది దసరా, దీపావళి తర్వాత బాగా ఊపందుకుంది. 'సొంతింటి కల సాకారం కోసం నగర పరిధి ఎంతగానో విస్తరించి ఉంది. కొనుగోలుదారుడు ఎక్కడ కొనాలి? ఏ బడ్జెట్‌లో ఉన్నారు? అన్న విషయాలను "మూడు రోజుల పాటు జరిగే క్రెడాయ్ ప్రాపర్టీ షో" ద్వారా కూడా ఎక్స్‌పోజ్ చేయనున్నాం. ప్రస్తుతం లంకెలపాలెం నుంచి తగరపువలస వరకూ బిల్డర్‌లు పలు ప్రాజెక్టులను చేపడుతున్నారు. 400 మంది క్రెడాయ్‌లో సభ్యులున్నారు. ఏటా సుమారు 350 నుంచి 400 ప్రాజెక్టులను క్రెడాయ్ చేపడుతోంది.

రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ఏమేమి అవసరం?

విశాఖ అత్యంత అందమైన ప్రదేశం. సహజ సిద్ధంగానే రాష్ట్రం, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను విశాఖ ఆకర్షిస్తోంది. అయితే ఇక్కడ 'మాస్ ప్లాన్ రోడ్ల'కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. హనుమంతవాక, కార్‌షెడ్ జంక్షన్, గాజువాక తదితర అవసరమైన చోట్ల పై ఓవర్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం చాలా ఉంది.

రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ ఘనత సాధించింది? విశాఖలో అది జరగాలంటే?

విశాఖకు కావాల్సిన అన్ని హంగులూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలూ ఉన్నాయి. అవి ఉంటేనే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి జరుగుతుంది. మార్కెట్‌లోకి వెళ్లి బట్టలు కొన్నా, బంగారం కొన్నా రియల్ ఎస్టేట్ అభివృద్ధి కిందే లెక్క. వ్యాపారం బాగా జరిగే ప్రదేశాల్లో విశాఖ ఒకటి. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు ఇంటర్నేషనల్ ఎయిర్ కనెక్టివిటీ కూడా రానుంది. ఈ ఎయిర్ పోర్టు వస్తే రియల్ ఎస్టేట్ రంగం మరింతగా దూసుకుపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ లోగా రోడ్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన గ్రామీణ ప్రాంతాలకు సైతం ప్రభుత్వం చేపట్టాలి. హైదరాబాద్‌లో అవుట్‌స్కర్ట్స్ (శివారు)ల్లోనే రియల్ ఎస్టేట్ రంగం, విల్లాలు భారీగా నిర్మాణం చేపడుతున్నారు. విశాఖలోనూ ఆ అవకాశం ఉంది.

విల్లాల నిర్మాణానికి విశాఖలో అవకాశాలు ఉన్నాయా?

చాలా అవకాశాలు కళ్లెదుటే ఉన్నాయి. కాపులుప్పాడ, రుషికొండ ప్రాంతం, పెందుర్తి వంటి చోట్ల ఈ అవకాశాలు కోకొల్లలు. ఇప్పటికే రుషికొండలో విల్లాస్ తయారవుతున్నాయి. ఐటి రంగం ఇక్కడ పాపులర్‌గా అభివృద్ధి అయ్యింది. ఇంకా అవకాశాలు మెరుగుపడితే విల్లాలు పెరగనున్నాయి.

ప్రత్యేక రైళ్ల సేవల విస్తరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, పలు ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని రైల్వే నిర్ణయించింది. 03357 ధన్‌బాద్ - ఎర్నాకులం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జనవరి 29 వరకు ఆదివారాలలో ఉదయం 06.00 గంటలకు ధన్‌బాద్‌లో బయలుదేరి సోమవారం ఉదయం 03.00 గంటలకు విశాఖపట్నం, మంగళవారం ఉదయం 08.00 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. 03358 ఎర్నాకులం - ధన్‌బాద్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు ఈ నెల 27 నుంచి జనవరి 31వ తేదీ వరకు రాత్రి 21.00 గంటలకు ఎర్నాకులం నుంచి బయలుదేరి బుధవరం రాత్రి 23.15 గంటలకు విశాఖపట్నం, గురువారం రాత్రి 22.00 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైళ్ళు వాల్తేరు డివిజన్‌లోని రాయగడ, విజయనగరం, విశాఖపట్నం స్టేషన్లలో అగుతాయని అధికారులు తెలిపారు.

08645 హటియా - ఎర్నాకులం వీక్లీ ఎక్స్‌ప్రెస్ 2023 జనవరి 2 నుండి జనవరి 30వ తేదీ వరకు సోమవారాల్లో ఉదయం 4:50 గంటలకు హటియా నుంచి బయలుదేరి, మంగళవారం రాత్రి 20.43 గంటలకు దువ్వాడ, బుధవారం రాత్రి 1.55 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. 08646 ఎర్నాకులం - హటియా వీక్లీ ఎక్స్‌ప్రెస్ జనవరి 5 నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు ప్రతి గురువారం ఎర్నాకులం నుంచి రాత్రి 07.15 గంటలకు బయలుదేరి, శుక్రవారం అర్ధరాత్రి 12.08 గంటలకు దువ్వాడ, శనివారాలలో ఉదయం 04.30 గంటలకు హటియా చేరుకుంటుందని అధికారులు తెలిపారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంపద తయారీ కేంద్రం పనులు పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి :సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేసి వాడుకలోకి తీసుకు రావాలని ఎంపీడీవో సీతారామరాజు, ఇఓపిఆర్డి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని కాగిత గ్రామంలో బుధవారం చెత్త నుండి సంపద తయారీ నిర్మాణ పనులను పరిశీలించారు. షెడ్డు నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సంపద తయారీ కేంద్రం అందుబాటు లోకి వస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, అంతే కాకుండా పంచాయతీకి కూడా ఆదాయం లభిస్తుందన్నారు.

6 నుంచి ఆపి గ్లోబల్ హెల్త్ సమ్మిట్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ ఆధ్వర్యాన జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.రవిరాజు తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ అసెంబ్లీ హాల్లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇండియాకి చెందిన వైద్యులు దాదాపు 80 వేల మంది అమెరికాలో నివాసం ఏర్పాటు చేసుకున్నారని, వారిని ఇక్కడికి రప్పించి ఈ సదస్సులో పాల్గొనేలా చేస్తున్నామని వివరించారు. ఆపి అధ్యక్షులు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ రవి కొల్లి ఇందుకు సంబంధించి సహకారం అందిస్తున్నారని చెప్పారు. ప్రపంచ దేశాల్లో నివసిస్తున్న వైద్యుల్లో చైతన్య కలిగించేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఇండియాలోని ఏ రాష్ట్రానికి చెందిన వారు ఆపి అధ్యక్షులు అవుతారో ఆ రాష్ట్రంలో గ్లోబల్ హెల్త్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమెరికాలో స్థిరపడ్డ వంద మంది ఇండియన్ డాక్టర్లు 400 మంది ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని వివరించారు. ముఖ్యంగా ఈ సమ్మిట్‌లో మెడిసిన్, సైకియాట్రి, గ్యాస్ట్రోఎంటరాలజీ, కిడ్నీ, న్యూ బోర్న్ హెల్త్, మధుమేహం, ఆంకాలజీ కార్డియాలజీ, న్యూరాలజీ, అంధత్వం వంటి వ్యాధులపై ప్రధానంగా చర్చిస్తామని తెలిపారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ ప్రోగ్రాం ఉంటుందని తెలియజేశారు. మహిళా వింగ్‌కి సంబంధించి అన్ని విషయాలను ప్రముఖ గైనకాలజిస్ట్ టి.రాధ చూస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆపి అధ్యక్షులు డాక్టర్ రవి కొల్లి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ టి.రాధ, డాక్టర్ విజయ్ శేఖర్, డాక్టర్ నవీన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -మాడుగుల:మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి పెదబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళపురెడ్డి వెంకట రాజారాం, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, పొలిమేర విజయలక్ష్మి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఉనీషా, మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు పాల్గొన్నారు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

జిల్లాలో 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

జెసి కల్పనా కుమారి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి సిబ్బందితో రీ సర్వే పై సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వే తీరు పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు, నిర్ణీత సమయంలో పూర్తి కాకపోతే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తివచ్చిందని, ప్రస్తుతం 161 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ఇంతవరకు లక్షా 30వేల ఎకరాల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్డ్ భూములు, మ్యూటేషన్, సరిహద్దులు, కోర్టు కేసుల సమస్యలు ఉన్నాయన్నారు. నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహశీల్దారు సోమశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిసుత్న జెసి

అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో సిడిపిఓ, హెల్త్ సిబ్బందితో రక్తహీనత పై తీసుకోవలసిన చర్యలపై వివరించారు. చిన్నారుల్లో రక్తహీనత సమస్య ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులకు, గర్భిణీలకు అవగాహన కల్పిస్తూ సకాలంలో మందులు అందజేయాలన్నారు. ఈ ఎంపీడీవో చంద్రశేఖర్, సిడిపిఓ సుజాత, వైద్య, అంగన్వాడీ సిబ్బంది, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.